క్లుప్తంగా

పెట్రోల్ బంకులో తనిఖీలు


తనిఖీ చేస్తున్న తహసీల్దార్ హనుమంతు

పెద్దపంజాణి: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకును గురువారం తహసీల్దార్ హనుమంతు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంకులోని బీ-ఫామ్ లైసెన్సు, ఫైర్ స్టేషన్ పర్మిషన్, రన్నింగ్ పర్మిషన్, పెట్రోల్ నాణ్యత, ఫ్రీ ఎయిర్, టాయ్‌లెట్, ఉచిత తాగు నీరు, స్టాకు బోర్డు, తూనికలు, కొలతలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఫణికుమార్, వీఆర్వో సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

గుడుపల్లె: వివిధ కేసుల్లో పట్టుబడిన 6 మోటారు సైకిళ్లను జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగానే ఆధార్, పాన్‌కార్డుతో పాటు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

వి.కోటలో..

వి.కోట: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు సీఐ ప్రసాద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఒక కారు, మూడు ద్విచక్రవాహలను వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వేలంలో పాల్గొని వాహనాలు దక్కించుకోవాలన్నారు. వాహనాలు పొందిన వారికి జీఎస్టీ వర్తిస్తుందని తెలిపారు.

కుప్పంలో..

కుప్పం: కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 8 వాహనాలను అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మధ్యాహ్నం 1 గంటలకు వేలం వేస్తామన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5 వేలు చెల్లించి అర్హత రశీదు పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ కోరారు.

రామకుప్పంలో..

రామకుప్పం: వివిధ కేసుల్లో పట్టుబడిన ఏడు ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. ఆసక్తి గలవారు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: స్థానిక ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ టి.శ్రీనివాస విశ్వనాథ్, తహసీల్దార్ హనుమంతు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి చెందారు. కార్యక్రమంలో పీఎస్ సుబ్రమణ్యం, వీఆర్వో సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంలో రెండు దుకాణాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. దీనిపై వారు గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులోని షేక్ ఇషాక్ టీ దుకాణంలో దుండగులు సామగ్రిని ఎత్తుకెళ్లారు. అదేవిధంగా బాలాజీ కుదువ అంగడిలో రూ.2 వేలు విలువ చేసే నగలు, నగదు రూ.2 వేలు నగదు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

రామకుప్పం డీటీగా దిలీప్ కుమార్

రామకుప్పం: జిల్లా సివిల్ సప్‌లై కార్యాలయంలో డీటీగా ఉన్న దిలీప్ కుమార్ రామకుప్పం డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కొలేష్ బదిలీపై వీకోటకు వెళ్లారు. అక్కడ ఆయన వీకోట తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాముల గుడిలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: మండలంలోని ధర్మవరంపల్లెలో గ్రామస్తులు నిర్మించిన శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమాన్ ఆలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, అభిషేకాలు చేపట్టారు. అలాగే ఆలయంలో కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఒక్కో చోట.. ఒక్కో రేటు

- చికెన్ ధరల్లో వ్యత్యాసాలు
- పేపర్ ధర కంటే బైరెడ్డిపల్లిలో తక్కువకే చికెన్
- పలమనేరులో మాత్రమే ఎక్కువ ధర
- దుకాణదారుల మధ్య నెలకొన్న పోటీనే కారణమా ?


పలమనేరులోని చికెన్ దుకాణం

పలమనేరు: నియోజకవర్గంలో ఒక్కోచోట ఒక్కోరకంగా ఉంటున్నాయి చికెన్ ధరలు. కొన్నిచోట్ల పత్రికల్లో వచ్చే ధర కంటే ఎక్కువగా ఉండగా, కొన్నిచోట్ల మాత్రం తక్కువ ధరకే చికెన్ విక్రయిస్తున్నారు. దీంతో ధరల వ్యత్యాసం ఎందుకు ఇలా అనే సందేహం సామాన్యప్రజలకు తలెత్తుతోంది. చికెన్ ధరల నియంత్రణకు పర్యవేక్షించడానికి ఫలానాశాఖ అంటూ ఏదీ లేకపోవడం వల్లే ధరల తారతమ్యాలకు కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. కానీ కొన్నిచోట్ల దుకాణదారుల మధ్య నెలకొన్న పోటీ కారణంగానే ధర తక్కువ చేసి చికెన్ అమ్ముతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

పలమనేరులో ఇలా..

పట్టణంలో వందకుపైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. గురువారం చికెన్ ధర(పేపర్‌రేట్) కిలో రూ.174గా ఉంది. ఇక్కడి దుకాణాల్లో రూ.170 నుంచి రూ.190 దాకా విక్రయిస్తున్నారు. ఇక్కడి వ్యాపారులంతా కలసికట్టుగా ఉండడంతో ధర నిర్ణయం వీరిచేతుల్లోనే ఉంది. కొన్ని సందర్భాల్లో డిమాండ్‌ను బట్టి ఇక్కడ ధరలు పెంచడం, లేదా నష్టానికి సైతం విక్రయించడం చేస్తుంటారు.

ఇతర మండలాల్లో ఇలా..

ఇదే నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, వీకోటలో మాత్రం వ్యాపారులు గురువారం కిలో చికెన్‌ను రూ.160 నుంచి రూ.170కే విక్రయించారు. మండల కేంద్రం బైరెడ్డిపల్లిలో మాత్రం కొన్ని దుకాణాల్లో కిలో రూ.150కే విక్రయిస్తున్నారు. పలమనేరుకు 20 కిలోమీటర్ల దూరంలోని బంగారుపాళెంలోనూ చికెన్ ధరలు రూ.165. ఒకే నియోజకవర్గంలో ధరల్లో ఇలా వ్యత్యాసాలు ఎందుకనే అనుమానం నాన్‌వెజ్ ప్రియులకు కలుగుతోంది.

పేపర్ రేట్ కంటే తక్కువకెలా..

పేపర్ రేట్ కంటే తక్కువకు చికెన్ విక్రయిస్తే తమకు నష్టాలు తప్పవంటున్న వ్యాపారులు, కొన్నిచోట్ల మాత్రం ఎందుకు తక్కువధరలకు అమ్ముతున్నారని జనం ప్రశ్నిస్తున్నారు. వారికి లాభాలు వచ్చినప్పుడు పలమనేరులో మాత్రం ధరలు ఎందుకు ఎక్కువగా ఉన్నాయనే మాట కూడా వినిపిస్తోంది.

తగ్గని చికెన్ ధరలు..

పలమనేరు ప్రాంతంలోని చెరువులన్నీ నిండడంతో చేపలకు కొదవలేదు. సప్లై ఎక్కువగా ఉండడంతో చేపల ధర కూడా తగ్గింది. ప్రస్తుతం పట్టణంలో చేపలు కిలో రూ.100 నుంచి రూ.130 వరకు పలుకుతున్నాయి. దీంతో చికెన్ ప్రియులు ఎక్కువగా చేపలను కొనేందుకు మొగ్గు చూపుతున్నారు.

ఈ విషయాన్ని పసిగట్టిన చికెన్ దుకాణాల యజమానులు చికెన్ ధరను డిమాండ్‌ను బట్టి తగ్గించడం చేపల ధరల పెరిగినపుడు చికెన్ ధర కూడా పెంచడం చేస్తున్నారు. అయితే ఒక్కోచోట ఒక్కో ధరకు చికెన్ లభిస్తుండడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోంది. లైవ్‌బర్డ్ రవాణాచార్జీలను బట్టి కూడా ధరల్లో తేడాలుంటాయని కొందరు వ్యాపారులు చెప్పడం గమనార్హం. ఏదేమైనా చికెన్ ధరలపై నియంత్రణ ఎవరు పర్యవేక్షించాలన్నదే ఇప్పుడు అర్థం కాని విషయంగా మారింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సంఘ సభ్యులకు సూచనలు ఇస్తున్న ఏపీఎం సర్వోత్తమరెడ్డి

చౌడేపల్లె: సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం సర్వోత్తమరెడ్డి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఇండియన్ బ్యాంకు రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ సేవలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చౌడేపల్లె, పుంగనూరు, సోమల, సదుం, పులిచెర్ల మండలాలకు చెందిన వీఓఏలు హాజరయ్యారు. వార మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాతాదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, విరివిగా పంట రుణాలు, బంగారు నగలపై తాకట్టు రుణాలతో పాటు పలు రకాల రుణాలు పొందవచ్చన్నారు. సోషల్ సెక్యూరిటీ స్కీమ్‌ల ద్వారా లబ్ధి పొందే సదుపాయం కూడా ఉందని తెలిపారు. పీఎం జేజేబీవై, పీఎంఎస్‌బీవై డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు, ఫోన్ చేసి వారికి బ్యాంకు, ఆధార్, ఓటీపీ వివరాలను చెప్పకూడదని సూచించారు. గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐదు రోజులపాటు వివిధ అంశాలపై అవగాహన సదస్సు కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్లు హరి కృష్ణ, మహేష్ తదితరులు ఉన్నారు.

గొర్రెల పెంపకందారులకు అవగాహన


గొర్రెల పెంపకందారులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: గొర్రెల పెంపకందారులు యాజమాన్య పద్ధతులను పాటించాలని డాక్టర్ పవన్‌కుమార్ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో విర్ బ్యాక్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో గొర్రెల పెంపకందారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యులు దామోదరరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులు వైద్యుల సలహాలను పాటించాలన్నారు. మూడునెలలకు ఒకసారి జీవాలకు నట్టల నివారణ మందు తాగించాలన్నారు. కాలానుగుణంగా వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. చిటికెవ్యాధి, పారుడురోగం, నీలినాలుక వ్యాధి సోకకుండా అప్రమత్తంగా ఉంటూ టీకాలు వేయించాలన్నారు. పౌష్టికాహారం కలిగిన మందులను జీవాలకు పెట్టడం ద్వారా వాటి పిల్లలు కూడా ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. గొర్రెల మందలపై విత్తనపు పొటేళ్లను ఏడాదికోసారి మార్చుచేయాలని సూచించారు. గొర్రెల పెంపకందారులు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ, విర్ బ్యాక్ ప్రతినిధులు సుమారు రూ.40 వేలు విలువచేసే మందులను పెంపకందారులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విర్‌బ్యాంకు ప్రతినిధులు మంజునాథ్, సిరాజుద్దీన్, తిరుపతి రెడ్డి, సిబ్బంది రెడ్డిప్రసాద్ ఉన్నారు.

మార్కెట్ యార్డు నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జేడీ రామాంజనేయులు

సోమల: కందూరు రోడ్డులో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న సోమల మార్కెట్ యార్డు పనులను ఆ శాఖ కడప జేడీ రామాంజనేయులు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిని పరిశీంచారు. నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, గతేడాది అందుబాటులోకి తేస్తామని చెప్పినా పనులు ఆలస్యం అవుతున్నాయని ఏఎంసీ చైర్మన్ అరుణమ్మ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, మార్కెటింగ్ కార్యదర్శి సరళాకుమారి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు విరాళం


ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న దాత రాజారెడ్డి

సోమల: మండలంలోని కామిరెడ్డిగారిపల్లె పంచాయతీ ఇడదలవారిపల్లెలో కోదండరామ స్వామి ఆలయ అభివృద్ధికి మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎల్‌కేటీ రాజారెడ్డి గురువారం రూ.50 వేలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు చిత్తూరుకు రామయ్య రథం

చిత్తూరు రూరల్: రామయ్యకు రథం రెడీ అయింది. ఆలయ నిర్వాహకులు రూ. 25 లక్షలు వ్యయం చేసి తీర్చిదిద్దిన ఈ రథం శని వారం సాయంత్రానికి నగరానికి చేరుకోనుంది. నగరంలోని రాముని గుడివీధిలో శ్రీ కోదండరామస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలోని స్వామివారికి రథం లేదు. శ్రీరామనవమి బ్రహోత్సవాలప్పుడూ రథం కోసం అష్టకష్టాలు పడేవారు. ఇది గమనించిన ఆలయ నిర్వాహకులు పాలకమండలి సమావేశంలో రథం విషయాన్ని చర్చకు తీసుకొచ్చారు. అందరూ కలిసికట్టుగా రథం సిద్ధం చేసేందుకు తీర్మానం చేశారు. ఏడాది క్రితం తమిళనాడు లోని తిరుచ్చిలో రథం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏడాది పాటు శ్రమించిన శిల్పులు టేకుతో సుందరంగా తీర్చిదిద్దారు. మొత్తం 32 అడుగుల పొడవుతో, మాడ వీధుల్లో రథం సులభంగా తిరిగడానికి వీలుండేలా తయారు చేశారు. శనివారానికి రథం ఆలయం వద్దకు చేరుకుంటుందని ఆలయ అర్చకులు వేణుగోపాల్ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల నూతన క్యాలెండర్, డైరీని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ గురువారం ఆవిష్కరించారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సయ్యద్ బాషా, నాయకులు రవీంద్రబాబు, జ్యోతీశ్వర్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహేష్, జ్యోతీశ్వరి, సుధీర, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను పేదలకు ఇవ్వండి


ఆర్డీఓ శివయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శాంతిపురం: కర్ణాటక వాసుల స్వాధీనంలోని అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని స్థానికంగా భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కుప్పం ఆర్డీఓ శివయ్యకు విన్నవించారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక నాయకులు కుప్పం ఆర్డీఓను ఆయన కార్యాలయంలో కలిశారు. డి-ఫారం పొందిన వారితో సంబంధం లేకుండా చేతులు మారిన అసైన్డ్ భూములు గత ప్రభుత్వాల హయాంలో కర్ణాటక వారి పేరిట మారాయని వివరించారు. ఆ రాష్ట్రానికి చెందిన వ్యాపారవేత్తలు, బడాబాబులు కూడా తమ కుటుంబ సభ్యుల పేరిట పదుల ఎకరాలను చేజిక్కించుకున్నారని చెప్పారు. ఈ మేరకు వారు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. దీనిపై రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించి పూర్తి నివేదిక తెప్పించుకుని తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రఘురామిరెడ్డి, మంజునాథరెడ్డి, రామ్మూర్తి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులపై సమీక్ష


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: మండలంలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్ షెడ్ పనులపై సమీక్ష నిర్వహించారు. వాటర్ షెడ్ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని చైర్మన్లు పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏ మునితుకారం, వాటర్‌షెడ్ చైర్మన్లు మదనమోహన్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, వాటర్‌షెడ్ ఏఈ రెడ్డిశేఖర్, ఎంపీటీసీలు రమణమ్మ, లక్ష్మీ, సర్పంచ్ హేమలత, నాయకులు చెంచురెడ్డి, కమలాకర్‌రెడ్డి, సురేంద్రనాయుడు, బాబు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించండి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

పలమనేరు: పోక్సో చట్టంపై విద్యార్థినులు అవగాహన పెంచుకుని, మీరు మీ గ్రామాలకు వెళ్లినపుడు అక్కడ మహిళలకు అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ పద్మజ సూచించారు. గురువారం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలమనేరు ఎస్‌ఐ నాగరాజు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న లైంగికదాడులు, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలనే అంశంపై వివరించారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు దాచి పెట్టుకోకుండా ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులకు తెలిపి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పోక్సో చట్టం ప్రకారం బాధితురాలి వివరాలు, కుటుంబీకుల సమాచారాన్ని సైతం గోప్యంగా ఉంచుతారన్నారు. ఇలాంటి కేసులు మహిళా పోలీసులచే విచారింపబడతాయన్నారు. చేసిన తప్పుకు నిందితుడికి జీవితఖైదు పడే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా అతావుల్లా


అతావుల్లా

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మైనారిటీ నాయకుడు బీటీ అతావుల్లాను నియమిస్తూ గురువారం పార్టీ ఆదేశాలు జారీ చేసింది. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడైన అతావుల్లాను నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అతావుల్లా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీని పటిష్టపరిచే బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. తనను నియమించిన మంత్రి పెద్దిరెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగాలకు 35 మంది ఎంపిక


మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజ

సోమల: స్థానిక మహిళా వెలుగు సమాఖ్య భవనంలో గురువారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగరాజ మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు నిరుద్యోగ యువతీ యువకులు 100 మంది హాజరయ్యారని తెలిపారు. అందులో అర్హులైన 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాబ్స్ ఏపీఎం వెంకటరమణ, ఏపీఎం శివయ్య, జేఆర్పీ రెడ్డెమ్మ, సీసీలు గంగోజీ, నరసింహులు పాల్గొన్నారు.

ఇంటర్ ఓపెన్ అడ్మిషన్లు ప్రారంభం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓపెన్ స్కూల్ మంజూరైందని ఇందుకు గాను 2022-23 సంవత్సరానికి సంబంధించి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైందన్నారు. గతంలో పదవ తరగతి పాసై డ్రాప్ అయిన విద్యార్థులు, ప్రస్తుతం ఇంటర్ మీడియట్ చదువుకోవాలనుకొని ఆసక్తి ఉన్నవారు ఈనెల 27వ తేదీలోపు అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి


కెనరా బ్యాంకును ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: కెనరా బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు ఏజీఎం నాగరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని కుప్పం రోడ్డులో ఉన్న కెనరా బ్యాంకు బ్రాంచ్‌ను స్థానిక పీఎన్‌కే బిల్డింగ్ పాత సిండికేట్ బ్యాంకు స్థానంలోకి మార్చారు. గురువారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేయాలని బ్యాంకు సిబ్బందికి విన్నవించారు. అలాగే ఎమ్మెల్యే వెంకటేగౌడ కూడా నూతన కెనరా బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు, నాయకులు పీఎన్‌కే హరికుమార్, వైస్ సర్పంచ్ అక్మల్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు,

వాహనాల వేలంతో రూ.5.23 లక్షల ఆదాయం

గంగవరం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయగా ప్రభుత్వానికి రూ.5.23 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం చిత్తూరు సెబ్ ఏఈఎస్ అయేషాభాను ఆధ్వర్యంలో 5 ద్విచక్ర వాహనాలు, 3 కార్లను వేలం వేశారు. దీంతో రూ.5.23 లక్షలకు వాహనాలను హెచ్చు పాటదారులు సొంతం చేసుకున్నారు.

చౌడేపల్లెలో

చౌడేపల్లె: మండల పరిధిలో గల వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఆరు వాహనాలను వేలంపాట ద్వారా రూ.1.19 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను గురువారం పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో వేలం నిర్వహించినట్లు చెప్పారు..

మానవత్వం చాటుకున్న పోలీసులు

గంగవరం: అనాథ శవానికి దగ్గర ఉండి అంత్యక్రియలు నిర్వహించి పోలీసులు మానవత్వం చాటుకున్నారు. గంగవరం మండలంలో పరిధిలోని కౌండిన్య నదిలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం విదితమే. మృతదేహాన్ని పోలీసులు గురువారం పలమనేరు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. అయితే మృతుడు ఎవరన్న వివరాలు తెలియకపోవడంతో ఏఎస్‌ఐ అశ్వర్థనారాయణ, కానిస్టేబుల్ షావీర్ ముందుకొచ్చి పలమనేరు పట్టణంలోని ఎలినా స్కూల్ పక్కన శ్మశానవాటికలో అనాథ శవానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.


అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు కృషి


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ రమాదేవి

ఐరాల: గర్భవతులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర ప్రోగ్రాం (నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్) అధికారి డాక్టర్ రమాదేవి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం గర్భవతులలో హిమోగ్లోబిన్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయా, లేదా.. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, ఓపీ, ల్యాబ్ రికార్డులు, ఇతర ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవించేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. గర్భం దాల్చిన తర్వాత మాతా, శిశు సంరక్షణ కార్డు అందించి నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. నెలలు నిండిన తర్వాత పురిటి నొప్పులు వచ్చే సమయానికి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరేలా ఏఎన్‌ఎంలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, డీపీహెచ్ఎన్ఓ రేణుకప్రభు, డీపీఎంఓ రామ్మోహన్, ఎపిడిమియాలజిస్ట్ వాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి తెలిపారు. మండలంలోని గురుకువారిపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో గర్భవతులు, పిల్లలకు, సాధారణ జబ్బులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. శిబిరంలో 85 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని అన్నారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్న పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.